# క్రైం కౌంటర్

website:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 127 క్రిష్ణా, ఆదివారం 01 - 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ణంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## ఏపీ ప్రజలకు బంపర్ ఆఫర్..



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 31,** ఏపీలోని ప్రజలకు కూటమి ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. పర్యావరణాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్న ప్రభుత్వం.. ఎలక్ట్రానిక్స్ వెహికల్స్‌ను ప్రోత్సహిస్తోంది. ఈ-వెహికల్స్‌పై భారీగా సబ్సిడీలు అందించాలని నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా ఇ-సైకిల్స్‌పై ఏకంగా రూ.10 వేల భారీ రాయితీ ఇస్తోంది. అంటే ఇ-వెహికల్స్ కొంటే రూ.10 వేల తగ్గింపు ప్రభుత్వం నుంచి పొందవచ్చు. ఇందుకోసం ప్రముఖ కంపెనీ అయిన ఈ-మోటోరాడ్స్‌తో ఏపీ ప్రభుత్వం తాజాగా ఒప్పందం కూడా కుదర్చుకుంది. అంతేకాకుండా ఈ సైకిళ్ల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం గిన్నీస్ రికార్డు కూడా సృష్టించింది. ఆ వివరాలేంటో ఇప్పుడు చూద్దాం.

ఒక్కసారి ఛార్జ్ చేస్తే..

ఈ సైకిళ్లు ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఏకంగా 40 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయి. వీటి ఒక్కో సైకిల్ ధర రూ.35 వేలుగా ఉంది. అయితే ప్రభుత్వం వీటిపై రూ.10 వేల రాయితీ అందిస్తోంది. దీంతో వీటిని కొనుగోలు చేసినవారికి రూ.25 వేలకు వస్తుంది. తాజాగా సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో 5,555 ఇ-సైకిళ్లను పంపిణీ చేశారు. కేవలం 24 గంటల్లోనే ఇది సైకిళ్లను పంపిణీ చేయడం రికార్డుగా చెప్పవచ్చు. దీంతో చిత్తూరు జిల్లా గిన్నీస్ రికార్డ్ సంపాదించుకుంది. ఈ మేరకు చిత్తూరు జిల్లా కలెక్టర్ దీనిని అందుకున్నారు. ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీలో భాగంగా కుప్పంలోని తూంసీలో చంద్రబాబు ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా మూడు కిలోమీటర్ల మేర చంద్రబాబు ఇ-సైకిల్‌పై ర్యాలీ చేపట్టి వేదిక వద్దకు చేరుకున్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ఇ-సైకిళ్లను ప్రోత్సహిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు.

కుప్పం రికార్డ్

24 గంటల్లోనే కుప్పంలో 5555 ఇ-సైకిళ్లను పంపిణీ చేయడం రికార్డు అని చంద్రబాబు తెలిపారు. కుప్పం ఈ రికార్డ్ సొంతం చేసుకుని గిన్నీస్ రికార్డుల్లోకి ఎక్కడం సంతోషంగా ఉందన్నారు. దీంతో కుప్పం సరికొత్త చరిత్ర సృష్టించిందని తెలిపారు. కొత్త చరిత్రకు కుప్పం శ్రీకారం చుట్టిందని, త్వరలోనే మరిన్ని రికార్డులు సృష్టిస్తుందని అన్నారు. ఇంటిలోనే ఈ సైకిళ్లకు ఛార్జింగ్ పెట్టుకోవచ్చని, ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.

## అంగన్వాడీ ఆయాలకు ప్రమోషన్లు.. పెరిగిన జీతం


**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 31,** అనంతపురం జిల్లాలోని అంగన్వాడీ ఆయాలకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖలో చాలా ఏళ్ల తర్వాత అంగన్వాడీ ఆయాలకు ప్రమోషన్లు కల్పించారు. అంగన్వాడీ ఆయాలకు కార్యకర్తగా పదోన్నతులు కల్పించారు. ఐసీడీఎస్ పరిధిలో చాలా మంది అంగన్వాడీ ఆయాలుగా ఏళ్ల తరబడిగా పనిచేస్తూ వచ్చారు. అయితే వారికి మాత్రం ప్రమోషన్లు కల్పించలేదు. అయితే ప్రభుత్వం తాజాగా వారి సమస్యల పరిష్కారంమీద దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే మినీ అంగన్వాడీ కేంద్రాలను.. మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తోంది. అనంతపురం జిల్లాలో ఈ ప్రక్రియ ఇటీవల పూర్తి అయ్యింది. అయితే మినీ అంగన్వాడీ కేంద్రాలను, మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయటంతో పాటుగా.. అందులో పనిచేసే అంగన్వాడీ ఆయాలకు.. అంగన్వాడీ కార్యకర్తగా ప్రమోషన్లు కల్పించారు. ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి ఈ మేరకు ప్రమోషన్లకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా.. జిల్లా ఎంపిక కమిటీ ఆమోదం అనంతరం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు అనంతపురం జిల్లా పరిధిలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2302 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. అనంతపురం అర్బన్ మినహాయిస్తే మిగతా పది ప్రాజెక్టులలో 223 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ 223 మినీ అంగన్వాడీ కేంద్రాలలో పదోతరగతి పాసై.. ప్రమోషన్లు అర్హులైన వారు 196 మంది ఉన్నారని అధికారులు వెల్లడించారు. వీరిలో 136 మందికి తాజాగా ప్రమోషన్లు కల్పించారు. కళ్యాణదుర్గంలో 25, ఉరవకొండ 22, శింగనమలలో 20, అనంతపురం రూరల్ 16, కంబదూరు, తాడిపత్రిలో 11 చొప్పున, గుత్తి, రాయదుర్గంలో 10 మంది చొప్పున, నార్పలలో 9, కణేకల్లులో ఇద్దరు చొప్పున ప్రమోషన్లు కల్పించారు. అంగన్వాడీ ఆయా నుంచి అంగన్వాడీ కార్యకర్తగా ప్రమోషన్లు రావటంతో వీరి జీతాలు కూడా నెలకు రూ.7000 నుంచి రూ.11,500లకు పెరగనుంది. దీంతో ప్రమోషన్లు పొందిన అంగన్వాడీ ఆయాల కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఇన్నాళ్లకు తమకు ప్రమోషన్లు దక్కాయని అంగన్వాడీ ఆయాలు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

## కుప్పం టూ స్వర్ణాంధ్ర: లక్ష మంది పారిశ్రామికవేత్తలే లక్ష్యంగా సీఎం చంద్రబాబు భారీ వ్యూహం

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 31,** ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి కుప్పం నియోజకవర్గాన్ని ఒక మోడల్ లాబొరేటరీగా తీర్చిదిద్దుతున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇక్కడ ప్రయోగాత్మకంగా అమలు చేసే ప్రతి ప్రజాహిత కార్యక్రమం విజయవంతం కావాలని, ఆ స్ఫూర్తితోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అభివృద్ధి పథకాలను విస్తరిస్తామని ఆయన స్పష్టం చేశారు. కుప్పం కేవలం ఒక నియోజకవర్గం మాత్రమే కాదని, రాబోయే రోజుల్లో నవ్యాంధ్ర ప్రదేశ్ ప్రగతికి దిక్సూచిగా నిలవబోతోందని సీఎం ధీమా వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను ఉపాధి పొందే స్థాయి నుంచి ఉపాధిని ఇచ్చే స్థాయికి ఎదగాలని కోరుకుంటూ 'వన్ ఫ్యామిలీ – వన్ ఆంత్రప్రెన్యూర్' అనే వినూత్న నినాదాన్ని చంద్రబాబు తెరపైకి తెచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కనీసం లక్ష మందిని నూతన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త పుట్టుకొచ్చినప్పుడే కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మారుతాయని, ఆ దిశగా ప్రభుత్వం అన్ని రకాల శిక్షణ మరియు ప్రోత్సాహకాలను అందిస్తుందని హామీ ఇచ్చారు.

కుప్పం అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే స్పష్టమైన ప్రణాళికతో అడుగులు వేస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. సుమారు ?7,088 కోట్ల భారీ పెట్టుబడులతో ఈ నియోజకవర్గంలో ఇప్పటికే 16 పరిశ్రమలు ఏర్పాటు కావడం ఒక శుభపరిణామమని ఆయన గుర్తు చేశారు. ఈ పరిశ్రమల ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, కుప్పం ప్రాంతం త్వరలోనే



పారిశ్రామిక హబ్‌గా రూపాంతరం చెందుతుందని వివరించారు. ఈ పెట్టుబడులు కుప్పం ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

'స్వర్ణాంధ్ర విజన్ 2047' లక్ష్యానికి కుప్పం మొదటి మెట్టు అని చంద్రబాబు అభివర్ణించారు. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ఐటి, తయారీ రంగం మరియు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతను సామాన్యుడికి చేరువ చేస్తూ, స్థిరమైన అభివృద్ధి సాధించడమే స్వర్ణాంధ్ర విజన్ సారాంశమని ఆయన పేర్కొన్నారు. కుప్పం నుంచి మొదలైన ఈ అభివృద్ధి ప్రస్థానం రాష్ట్రంలోని ప్రతి గడపకూ చేరుతుందనే బలమైన నమ్మకాన్ని ఆయన వెలిబుచ్చారు.

## కుప్పానికి ప్రగతి కళ 7,088 కోట్ల పెట్టుబడులు..16 పరిశ్రమలు



**ప్రత్యక్షంగా, పరోక్షంగా 70 వేల మందికి ఉపాధి**

**మెరుగైన వైద్యసేవలు ప్రజల వద్దకే చేరేలా రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టు అమలు**

**కుప్పం ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి**

**నివాసం నుంచి ప్రజావేదిక వరకు ఈ-సైకిల్‌పై వచ్చిన ముఖ్యమంత్రి**

**24 గంటల్లో 5,555 ఈ-సైకిళ్ల పంపిణీతో కుప్పానికి గిన్నిస్ వరల్డ్ రికార్డు**

**క్రైం కౌంటర్ న్యూస్,** కుప్పం/శాంతిపురం/గుడుపల్లె, జనవరి 31 ఎన్నికల్లో సైకిల్‌కు ఓటేయడం ద్వారా ప్రజలు అభివృద్ధికి చోటిచ్చారని సీఎం చంద్రబాబు అన్నారు. కుప్పం నియోజకవర్గంలో రెండోరోజు శనివారం ఆయన పర్యటించారు. చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం బెగ్గిలపల్లెలో మునెమ్మ, వెంకటరామప్పకు వృద్ధాప్య పింఛన్, చిన్నతాయమ్మకు వితంతు పింఛన్‌ను పంపిణీ చేశారు. లబ్ధిదారుల కుటుంబసభ్యులతో ముచ్చటించి వారి బాగోగులు తెలుసుకున్నారు. ఆ తర్వాత శాంతిపురం మండలం తుమ్మిశి వద్ద ఏర్పాటుచేసిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. "దేశంలో మరే ఇతర రాష్ట్రంలో కూడా అమలు కానంతగా సంక్షేమ పథకాలు మన వద్ద అమలవుతున్నాయి. నెలకు రూ.2,730 కోట్లను పెన్షన్ల రూపంలోనే పంపిణీ చేస్తున్నాం. తమిళనాడులో రూ.315 కోట్లు, కర్ణాటకలో రూ.392 కోట్లు మాత్రమే పెన్షన్ల కోసం కేటాయిస్తున్నారు. సూపర్‌సిక్స్‌లోని అన్ని పథకాలనూ అమలు చేసి సూపర్‌హిట్ చేశాం" అని వివరించారు. మహిళలకు అన్ని రంగాల్లోనూ సమాన ప్రాధాన్యం కల్పించింది టీడీపీయేనన్నారు. "ఆస్తిలో మహిళలకు సమాన హక్కు ఎన్టీఆర్ కల్పిస్తే, నేను 33శాతం రిజర్వేషన్లను ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో అమలు చేశాను. త్వరలో చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు రానున్నాయి. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ విధానంలో లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేసే లక్ష్యాన్ని మరింత పెంచుతాం. డ్వాక్రా సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి" అని ఆకాంక్షించారు. కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించి విజయవంతమైన డిజిటల్ హెల్త్ రికార్డుల ప్రాజెక్టు సంజీవనిని ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చంద్రబాబు చెప్పారు. "మెరుగైన వైద్య సేవలను ప్రజలకు ఇంటి వద్దకే అందుబాటులోకి తెచ్చేలా సంజీవని ప్రాజెక్టు అమలు చేసేందుకు నిర్ణయించాం.

కుప్పానికి రూ.7,088 కోట్ల పెట్టుబడులతో 16 పరిశ్రమలు రావడంతో ప్రత్యక్షం, పరోక్షంగా 70 వేల మందికి ఉపాధి లభించనుంది. వర్క్ ఫ్రమ్ హోం చేసుకునేవారికి, ఆఫీసు స్పేస్ లేనివారికి ఉపయోగపడేలా కుప్పంలో రాష్ట్రంలోనే తొలి కో- వర్కింగ్ స్పేస్‌ను ఏర్పాటు చేశాం" అని సీఎం వివరించారు.విధ్వంస పాలనతో రాష్ట్ర అభివృద్ధిని వైసీపీ వెనక్కి నెట్టిందని మండిపడ్డారు. "వైసీపీ ఐదేళ్ల పాలన కారణంగానే కూటమి ప్రభుత్వానికి భూవారసత్వ సమస్యలు వచ్చాయి. రూ.700 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేసి పా సుపుస్తకాలపై, సర్వే రాళ్లపై జగన్ తన ఫొటోలను ముద్రించుకున్నారు. దుర్మారం చేసింది చాలక, ఇప్పుడు తమ పాలనే బెటర్ అంటూ మాట్లాడుతున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరుతో తెచ్చిన నల్లచట్టాన్ని కూడా సమర్థించుకుంటున్నారు'' అని మండిపడ్డారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డులో కుప్పానికి చోటు

జనవరి 29 మధ్యాహ్నం 12 గంటల నుంచి 30వ తేదీ 12 గంటల వరకు 5,555 ఇ-సైకిళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డులో కుప్పం నియోజకవర్గం చోటు సంపాదించుకుంది. ఇ-సైకిళ్లను ఇంత పెద్ద సంఖ్యలో పంపిణీ చేయడంపై ఈ రికార్డు నమోదు అయినట్లు గిన్నిస్ వరల్డ్ బుక్ ప్రతినిధి ప్రకటించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు సమక్షంలో చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇ-సైకిళ్ల తయారీ సంస్థ ఇ-మోటరాడ్ ప్రతినిధులకు సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కుప్పాన్ని కాలుష్యరహితంగా మా ర్చేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగా 5,555 ఇ-సైకిళ్లను పంపిణీ చేశామన్నారు. ప్రతి వెయ్యి ఇ-సైకిళ్ల ద్వారా ఏడాదికి 37 టన్నుల కార్బన్ డైయాక్సైడ్ తగ్గుతుంది. సైకిల్ అంటే పురోగతికి చిహ్నం. ఇ-సైకిల్ ఈతరానికి సింబల్‌గా నిలుస్తుంది" అని అన్నారు.

4 కిలోమీటర్లు సైకిల్‌పై సీఎం

'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా బెగ్గిలపల్లెలో పెన్షన్లను పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు అనంతరం, కడపల్లెలోని తన నివాసం నుంచి తుమ్మిశిలోని ప్రజావేదిక వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ఇ-సైకిల్‌లో ర్యాలీగా వచ్చారు. 75 ఏళ్ల వయసులోనూ సైకిల్ తొక్కుతూ రావడం చూసిన అక్కడి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఆశ్చర్యపోయారు. అనంతరం కుప్పం నియోజకవర్గంలోని పీ4 బం గారు కుటుంబాలు- మార్గదర్శులతో సీఎం సమావేశమయ్యార. కుప్పంలోని మూడు మండలాలను దత్తత తీసుకున్న మేఘా ఇంజనీరింగ్, అదానీ ఫౌండేషన్, టీవీఎస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులతో ముఖా ము ఖిలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీ ప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటితో డిజిటల్ లైబ్రరీ, కో-వర్కింగ్ స్పేస్ సెంటర్

కుప్పం మున్సిపాలిటీలోని స్వర్ణ నవదిశ సెంటరులోని రెండు అంతస్తుల్లో అన్ని రకాల టెక్నాలజీ వసతులతో డిజిటల్ లైబ్రరీ, కో-వర్కింగ్ స్పేస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని సీఎం చంద్రబాబు శుక్రవారం రాత్రి ప్రారంభించగా.. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) కార్పొరేషన్ సంస్థ రూ.కోటి ఆర్థికసాయం అందించిందని ఆ సంస్థ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలిపారు. ఈ సెంటరు వల్ల విద్యార్థులు, ఉద్యోగార్థులు, ఫ్రీలాన్సర్లు లబ్ధి పొందుతారని, ము ఖ్యంగా గ్రామీణ పే ద కుటుంబాలకు ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా మోహనకృష్ణను సీఎం చంద్రబాబు అభినందించారు.

# ఏపీలోని ప్రభుత్వ ఇళ్ల లబ్దిదారులకు బిగ్ అలర్ట్.



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 31,** ఆంధ్రప్రదేశ్‌లో ఇల్లు కట్టుకునేవారికి ప్రభుత్వం అలర్ట్ జారీ చేసింది. ఇంటి నిర్మాణాలపై లబ్దిదారులకు కీలక అప్డేట్ ఇచ్చింది. గతంలో ప్రభుత్వం నుంచి ఇళ్ల నిర్మాణ పథకం ద్వారా ఇల్లు మంజూరై నిర్మించుకుంటున్నవారికి డెడ్ లైన్ విధించింది. మార్చి నెలాఖరు నాటికి పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రజలకు సూచనలు జారీ చేస్తూ ప్రకటన విడుదల చేసింది. ఉగాదికి పెండింగ్‌లో ఉన్న ఇళ్లన్నీ పూర్తి చేసేందుకు ప్రభుత్వం సిద్దమవుతోంది. ఉగాదికి ఐదు లక్షల ఇళ్లకు ఒకేసారి గృహప్రవేశం చేయాలని చూస్తోంది. ఈ క్రమంలో మార్చిలోపు ఇంటి నిర్మాణం పూర్తి చేసేలా పనులు వేగవంతం చేయాలని లబ్దిదారులకు గృహనిర్మాణ అధికారులు సూచిస్తున్నారు.

ఉగాది తర్వాత చెల్లింపులు బంద్

ఉగాది నాటికి ఇంటి నిర్మాణం పూర్తి చేయకపోతే ఆన్‌లైన్ నుంచి పేరు తొలగించనున్నారు. దీని వల్ల చెల్లింపులు నిలిచిపోతాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. అందుకే వేగంగా ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని చెబుతున్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్లను పూర్తి చేసేందుకు ఏపీ ప్రభుత్వం అదనపు సాయం కూడా అందిస్తోంది. దీంతో వీటి సాయంతో త్వరతగతిన ఇళ్లను పూర్తి చేయాలని ఏపీ గృహనిర్మాణశాఖ సూచిస్తోంది. ఇళ్ల నిర్మాణాలు మధ్యలో ఆగిపోయినవారిలో ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్సీలకు రూ.75 వేలు అదనంగా ఆర్థిక సహాయం అందిస్తోంది. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం ఆవాస్ యోజన పథకం ద్వారా కూడా రాష్ట్ర ప్రభుత్వం సాయం అందిస్తోంది.

ఒకేసారి ఐదు లక్షల ఇళ్లకు గృహప్రవేశం

మార్చి చివరిల్లోగా పూర్తిచేయకపోతే లబ్దిదారుల పేర్లను ఆన్ లైన్ నుంచి తొలగించేందుకు ఏపీ ప్రభుత్వం సిద్దమవుతుందని తెలుస్తోంది. దీని వల్ల పెండింగ్ బిల్లులు ఆగిపోవడం వల్ల లబ్దిదారులు నష్టపోతారు. గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల నిర్మించి ఇచ్చింది. కానీ కొంతమంది సొంత స్థలంలో ఇళ్లను నిర్మించుకున్నారు. అయితే ఈ నిర్మాణాలను కొంతమంది మధ్యలో ఆపివేశారు. అలాంటి లబ్దిదారులకు అదనంగా ఆర్థిక సాయం ప్రభుత్వం అందుతోంది.

# పోలవరానికి సంపూర్ణ సహకారం!

**రూ.3 వేల కోట్ల విడుదలకు కేంద్రం అంగీకారం**
**రూ.1500 కోట్ల చొప్పున రెండు విడతల్లో..**
**డ్యామ్ పనులపై ఆరా తీసిన కేంద్ర జలశక్తి శాఖ**
**ఆ శాఖ జాయింట్ సెక్రటరీతో ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి భేటీ**
**డిజైన్లకు త్వరలోనే ఆమోదం: జలశక్తి శాఖ**



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 31,** అమరావతి, పోలవరం ప్రాజెక్టును కేంద్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. చివరి అంకంలో ఉన్న ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అవరోధాలూ ఎదురు కాకుండా చూడాలంటూ కేంద్ర ఆర్థిక, జల శక్తి శాఖలను ఆదేశించింది. ఇటీవల అమరావతిలో 14 బ్యాంకుల ప్రధాన కార్యాలయాల శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చినప్పుడు, పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆరా తీశారు. అప్పటి షెడ్యూల్‌ను బట్టి 2027 డిసెంబరు నాటికి ప్రాజెక్టు పూర్తవుతుందని ఆమెకు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అయితే..గోదావరి పుష్కరాల నాటికే పోలవరాన్ని పూర్తి చేయాలని సీఎంకు నిర్మల సూచించారు. దీంతో.. పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాది జూన్‌కల్లా పూర్తి చేయాలంటూ జల వనరుల శాఖ అధికారులు, కాంట్రాక్టు సంస్థలకు చంద్రబాబు నిర్దేశించారు. గత నెల పోలవరం ప్రాజెక్టు క్షేత్ర పర్యటనకు వెళ్లిన చంద్రబాబుకు, కీలకమైన డయాఫ్రమ్ వాల్ ఫిబ్రవరి నెలాఖరునాటికి పూర్తవుతుందని ..గ్యాప్ -1, గ్యాప్-2 పనులు సహా డయాఫ్రమ్‌వాల్‌పై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌ను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయగలమని కాంట్రాక్టు సంస్థ తెలిపింది. గత నెలలో పోలవరం ప్రాజెక్టును సందర్శించిన కేంద్ర జల సంఘం అధికారులతో 2027 మార్చినాటికి పోలవరం తొలిదశ 41.15 మీటర్ల కాంటూరులో పూర్తి చేస్తామని పోలవరం ప్రాజెక్టు పనులు పర్యవేక్షిస్తున్న ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి తెలిపారు.

కాగా, పోలవరం ప్రాజెక్టుకు నిధుల విడుదలలో ఎలాంటి అవరోధాలు రానివ్వబోమని రాష్ట్ర ఆర్థిక శాఖకు కేంద్ర జలశక్తి శాఖ స్పష్టంచేసింది. శుక్రవారం జలశక్తి శాఖ సంయుక్త కార్యదర్శి కాంతారావును ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్ కలిశారు. మూడో విడత కింద రూ. 3,000 కోట్లు ఇవ్వాలని కాంతారావును రొనాల్డ్ రోస్ కోరారు. ఈ నిధులు మంజూరు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కాంతారావు వివరించారు. చెరో రూ. 1,500కోట్లు చొప్పున రూ. 3,000 కోట్లను అందిస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ప్రాజెక్టు ప్రధాన డ్యామ్ నిర్మాణ పనుల తీరుపై నరసింహమూర్తిని కాంతారావు ఆరా తీశారు. పోలవరం ప్రాజెక్టు పనులు వచ్చే ఏడాది మార్చి లేదా జూన్ నాటికి పూర్తి చేస్తామని నరసింహమూ ర్తి ధీమా వ్యక్తంచేశారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ డిజైన్లను కేంద్ర జల సంఘం ఆమోదించాల్సి ఉం దని నరసింహమూర్తి వివరించారు. దీంతో .. నిధుల విడుదలతో సహా డిజైన్లను కూడా వీలైనంత వేగంగా ఆమోదం తెలుపుతామని కాంతారావు హామీ ఇచ్చారు.

# అంబటి కన్నా ఆంబోతు నయం టీడీపీ నేతల ఆగ్రహం



**క్రైం కౌంటర్ న్యూస్,** తిరుపతి, జనవరి 31వైసీపీ నేత అంబటి రాంబాబు కన్నా ఆంబోతు నయమని టీడీపీ నేతలు మండిపడ్డారు. రాజకీయాన్ని కలుషితం చేస్తూ గొడవలు, హత్యలకు వైసీపీ ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుపై అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై సోమవారం తిరుపతిలో ఆగ్రహ జ్వాలలు చెలరేగాయి. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టీడీపీ నేతలు రవినాయుడు, జేబీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబటి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ గురించి నీచమైన మాటలు మాట్లాడితే ప్రజలు తోలుతీస్తారని హెచ్చరించారు. ఇకనుంచి అంబటికి కూటమి నేతల సినిమా ఏవిధంగా వుంటుందో చూపిస్తామన్నారు. గంగమ్మ ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, కార్పొరేటర్ అన్నా అనిత, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, టీఎన్ఎ?సఎ?ఫ పార్లమెంటు అధ్యక్షుడు హేమంత్ రాయల్ మాట్లాడుతూ వైసీపీ రాష్ట్రంలోకి మళ్లీ బూతుల సంస్కృతిని తెరపైకి తెస్తోందన్నారు. చంద్రబాబును దూషిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు.ఆకు రౌడీకన్నా నీచంగా మాట్లాడుతున్న అంబటి రాంబాబును పార్టీ ఆదేశిస్తే అంతుచూస్తామని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ అలిపిరివద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఎంను విమర్శిస్తే ఖబడ్దార్! సీఎం చంద్రబాబును సంస్కారం లేకుండా విమర్శిస్తే తీవ్ర మూల్యం చెల్లించాల్సి వస్తుంది. గత ఐదేళ్ళూ చంద్రబాబు పట్ల అమానుషంగా వ్యవహరించిన పాపానికి వైసీపీ 11 స్థానాలతో మూల్యం చెల్లించింది. ఇప్పటికీ బుద్ధి తెచ్చుకోకుండా మునుపటిలానే ప్రవర్తిస్తే ఆ పార్టీకి పుట్టగతులుండవు. అంబటి తీరు అతడితో పాటు వైసీపీ సంస్కృతిని చాటుతోంది. అయితే అలాంటి సంస్కృతిని సహించేది లేదు. చట్టపరంగా ప్రభుత్వం తీసుకునే చర్యలకు తోడు టీడీపీ శ్రేణుల ఆగ్రహాన్ని కూడా చవి చూడాల్సి వస్తుంది.

– పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే

చంద్రబాబుకు క్షమాపణ చెప్పాలి అంబటి రాంబాబు అహంకారంతో మాట్లాడిన మాటలు సభ్య సమాజం తలదించుకునేలా వున్నాయి. చివరికి అతడి కుటుంబ సభ్యులు కూడా సిగ్గుతో తలదించుకునే పరిస్థితి వుంది.మాకూ నోళ్ళున్నాయి, అయితే సంస్కారం అడ్డొస్తోందంతే. అంబటి లాంటి వాళ్ళు రాజకీయ నాయకులుగా కొనసాగడం సమాజానికి హానికరం.అలాంటి వారిని అడ్డుకోలేని వైసీపీ అధినేత జగన్ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలి.

– గాలి భానుప్రకాష్, నగరి ఎమ్మెల్యే

అంబటి వ్యాఖ్యలు జుగుప్సాకరం

చంద్రబాబుపై అంబటి చేసిన వ్యాఖ్యలు జుగుప్సాకరం. ప్రపంచ దేశాల్లో ఆంధ్రరాష్ట్రానికి గుర్తింపు తీసుకువచ్చిన వ్యక్తిపై వైసీపీ రౌడీలు అభ్యంతరకరంగా వ్యాఖ్యానించడాన్ని ఖండిస్తున్నాం.ఆ వ్యాఖ్యలు తక్షణమే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలి. లేకపోతే తెలుగుదేశం తరపున ఆయనకు బుద్ధి చెబుతాం.

– నెలవల విజయశ్రీ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే

అవాకులు చవాకులు పేలితే నాలుకకోస్తా

ముఖ్యమంత్రి చంద్రబాబుపై అవాకులు చవాకులు పేలితే నాలుకకోస్తాం.శ్రీవారి లడ్డూ ప్రసాదాలకు వినియోగించే నెయ్యిని కల్తీ చేసి ఆలయ పవిత్రతను దెబ్బతీసిన వైసీపీ నేతల పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం నెలకొనివుంది.ఆ ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రిని వైసీపీ నేతలు దుర్భాషలాడుతున్నారు.భాషను అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు.

# కల్తీ నెయ్యిపై డైవర్షన్ పాలిటిక్స్

**సిట్ చార్జిషీట్ నేపథ్యంలోనే 'బూతు పురాణం'**
**కల్తీ'ని సమర్థించుకోలేక వైసీపీ మల్లగుల్లాలు**
**దిక్కుతోచక ప్రజల దృష్టి మళ్లించే ఎత్తుగడ**
**రంగంలోకి అంబటి.. బాబుపై తీవ్ర వ్యాఖ్యలు**
**తానున్నానంటూ మాజీ మంత్రికి జగన్ అండ**



**ఇంటర్నెట్ డెస్క్:** తీవ్రమైన వివాదాల్లోకి కూరుకుపోయినప్పుడు.. తీవ్రమైన సమస్యలు చుట్టుముట్టినపుడు.. దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నప్పుడల్లా.. వైసీపీ వాడే అస్త్రం డైవర్షన్ పాలిటిక్స్. గతంలో ప్రతిపక్షంలో ఉన్నా.. తర్వాత అధికారంలో ఉన్నా.. ఇప్పు డు మళ్లీ విపక్షంలో ఉన్నా.. ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇదే ఎత్తుగడ. తామే తప్పులు చేసి ఎదుటివారిపై నిందలు వేయడం.. ప్రజల దృష్టి మళ్లించేందుకు లేదా ప్రజల సానుభూతి కోసం 'నాటకాలు' ఆడటం ఆనవాయితీగా వస్తోంది. వివేకా హత్యపై 'కట్టు'కథలు, కోడి కత్తితో దాడి.. ఇలా ఎన్నో డైవర్షన్ పాలిటిక్స్ నడిపారు. తాజాగా తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి ఎపిసోడ్ నుంచి ప్రజల దృ ష్టి మళ్లించేందుకు మరో నాటకానికి తెరలేపారు. గత వైసీపీ ప్రభుత్వంలో తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి కలపడం నిజమేనంటూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు చేసిన సీబీఐ సిట్ తేల్చిన సంగతి తెలిసిందే. దీన్ని సమర్థించుకునేందుకు వైసీపీ నేతలు నానా పాట్లు పడ్డారు. టీడీపీపై ఎదురుదాడికి దిగారు. నెయ్యి కల్తీ జరిగినట్టు సిట్ చెప్పినా చంద్రబాబు ఆరోపించినట్టుగా నెయ్యిలో జంతుకొవ్వు కలిపినట్టు తేల్చలేదని తప్పును కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. కానీ, ఎన్‌డీడీబీ రిపోర్టు బయటకు రావడంతో తాము చేస్తున్న వాదన లు బూమరాంగ్ అయ్యాయని జగన్ బృందం గ్రహించింది. దీంతో ప్రజల దృష్టి మళ్లించేలా వైసీపీ నేత అంబటి రాంబాబును రంగంలోకి దింపారు.

# విద్య, వైద్యం, వనం ప్రతి ఒక్కరికీ అవసరం



**క్రైం కౌంటర్ న్యూస్,** కందుకూరు, జనవరి 31 విద్య, వైద్యంతోపాటు వనం కూడా నేడు ప్రతిఒక్కరికీ అవసరంగా మారిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. పర్యావ రణాన్ని కాపాడుకోకుంటే భవిష్యత్తు గందరగో ళంగా మారే ప్రమాదం ఉందన్నారు. అందుకోసం ప్రతిఒక్కరూ తమవంతుగా ఒక వనం పెంచేం దుకు సిద్ధపడాలని సూచించారు. శనివారం కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2 ఎకరాల విస్తీర్ణంలో స్కంధపురి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మియావాకీ ఫారెస్టు ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తోపాటు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కలెక్టరు రాజాబాబు తదితరులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వాలు కూడా నగర వనాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాయ న్నారు. ఈ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు కూడా తమవంతుగా పాల్గొంటుండటం అభినం దనీయమన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ 2047 నాటికి రాష్ట్రంలో అటవీ విస్తీర్ణాన్ని 50శాతం మేరకు పెంచేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. మన చుట్టూ పచ్చదనం ఉండే లక్ష్యంతో ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లా డుతూ ఆక్సిజన్ కొనుక్కునే పరిస్థితి వస్తే ఎంత దుర్లభంగా ఉ ంటుందో మనం కరోనా సమయంలో చూశామని, అందుకే పర్యావరణాన్ని కాపాడుకోవటం అందరి బాధ్యత కావాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఈ సందర్భంగా పట్టణంలోని టిడ్కో గృహాల సముదాయం వద్దకు సిమెంటు రోడ్డు నిర్మాణం, ఏకలవ్య నగర్‌లో సిమెంటు రహదారి, కాలువల నిర్మాణం కోసం రూ. 86.50 లక్షలతో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, కందుకూరు సబ్‌కలెక్టరు దామెర హిమవంశీ, మున్సిపల్ కమిషనర్ అనూష, టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, స్కంధపురి సేవాసమితి కన్వీనర్ పువ్వాడి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ప్రజలకు గుడ్‌న్యూస్.



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 31,** వేసవి వచ్చిందంటే చాలు.. కరెంట్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఎండ వేడి, ఉక్కబోత తట్టుకోలేక ప్రజలు ఇళ్లల్లో ఏసీల, కూలర్లు , ఫ్యాన్లు ఎక్కువగా వాడుతూ ఉంటారు. దీని వల్ల విద్యుత్ కోతలు సాధారణంగా ఉంటాయి. దీనిని అధిగమించేందుకు ఏపీ ప్రభుత్వం సరికొత్త ప్లాన్‌తో ముందుకు వెళ్తుంది. ప్రజలకు వేసవిలో అసలు కోతలు లేకుండా విద్యుత్ అందించేందుకు ఇప్పటినుంచే పక్కా ప్రణాళికలతో ముందుకు వెళు తుంది. ఆ వివరాలేంటో ఇప్పుడు చూద్దాం.

కొత్త విద్యుత్ ప్రాజెక్టులకు శ్రీకారం

విద్యుత్ కోతలు అనేవి లేకుండా ఉండాలంటే విద్యుత్ ఉత్పత్తి ఎక్కువగా ఉండాలి. దీంతో రాష్ట్రంలో ఉత్పత్తిని పెంచేందుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా కొత్త విద్యుత్ ప్రాజెక్టులను నిర్మిస్తోంది. రూ.6 వేల కోట్లతో కొత్త విద్యుత్ ప్రాజెక్టులకు నిర్మిస్తుండగా.. ప్రస్తుతం వీటి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు నెలల్లో ఈ ప్రాజెక్ట్‌ల పనులు పూర్తి చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. తాజాగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల విషయమై సచివాలయంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నెలల్లో పనులు వెంటనే పూర్తి చేసి కొత్త ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చేలా ప్రయత్నాలు చేయాలని సూచించారు. నిర్ణీత సమయంలో అన్నింటినీ కంప్లీట్ చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్

ఏపీవ్యాప్తంగా ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను ఉద్ధమంగా తీర్చిదిద్దాలని అధికారులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. ఇప్పటికే ట్రాన్స్‌మిషన్ ఇబ్బందులను ఎదుర్కొనేందుకు జిల్లాల్లో కొత్త సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వీటిని నిర్ణీత సమయంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇక అమరావతిలో రాజధాని అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్న క్రమంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ విద్యుత్ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్‌తో పాటు ట్రాన్స్‌కో ఉన్నతాధికారుల పాల్గొన్నారు.

# ఆ లోపు నిర్మాణం పూర్తి చేయండి.. లేకపోతే బిల్లులు డౌటే



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 31,** రాష్ట్రంలో ఇల్లు లేని పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందరికీ ఇల్లు కల్పించాలనే ఉద్దేశంతో అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే ఉగాది రోజున ఐదు లక్షల ఇళ్లల్లో గృహప్రవేశాలు చేయించాలని ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. మరోవైపు.. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేసేలా ఏపీ గృహ నిర్మాణ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించేందుకు ఏపీ ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం కూడా అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇలాంటి లబ్ధిదారులు మార్చి నెలాఖరు లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయకపోతే.. బిల్లులు నిలిచిపోయే అవకాశం ఉందని గృహ నిర్మాణ శాఖ అధికారులు చెప్తున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నారు.మరోవైపు వైసీపీ ప్రభుత్వం హయాంలో జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అలాగే పలువురు లబ్ధిదారులు సొంత స్థలాలలోనూ ఇంటి నిర్మాణాలు మొదలుపెట్టారు. అయితే వివిధ కారణాలతో నిర్మాణాలను పూర్తి చేయకుండా అలాగే వదిలేసిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు 50 వేల రూపాయలు, ఎస్టీ లబ్ధిదారులకు 75 వేల రూపాయల చొప్పున అదనంగా అందిస్తోంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద అదనంగా ఆర్థిక సాయం అందజేస్తున్నారు.ఈ నేపథ్యంలో లబ్ధిదారులు ఉగాదిలోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అలా చేయలేకపోతే.. ఉగాది తర్వాత లబ్ధిదారుల పేర్లు ఆన్‌లైన్‌లో కనిపించవని హెచ్చరిస్తున్నారు. దీంతో బిల్లుల చెల్లింపులు నిలిచిపోవచ్చని.. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలోపే ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచిస్తున్నారు. మరోవైపు ఉగాది రోజున ఐదు లక్షల కొత్త ఇళ్లల్లో గృహప్రవేశాలు చేయించేందుకు ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆ దిశగా ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# టీటీడీ నెయ్యి వ్యవహారంలో సిట్ ఛార్జ్‌షీట్‌పై బహిరంగ చర్చకు సిద్ధమా?



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 31,** తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం ముదిరింది. టీటీడీ నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని సీబీఐ లేదా సిట్ ఛార్జ్‌షీట్‌లో ఎక్కడ ఉందో చూపించాలని కూటమి నేతలకు మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెల్లంపల్లి శ్రీనివాస్ బహిరంగ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ ఈ అంశంపై కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ వ్యవహారానికి సంబంధించిన నిజానిజాలు బయటకు రావాలంటే అధికార పక్షం చర్చకు రావాలని ఆయన డిమాండ్ చేశారు.

నారా లోకేశ్ సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసిన బ్రీఫ్ నోట్ కేవలం తప్పుడు ప్రచారంలో భాగమేనని వెల్లంపల్లి విమర్శించారు. సిట్ సమర్పించిన ఛార్జ్‌షీట్‌లోని 208 నుంచి 211 పేజీలలో ఉన్న ల్యాబ్ రిపోర్టులను క్షుణ్ణంగా చదువుకోవాలని ఆయన సూచించారు. అందులో ఎక్కడా జంతువుల కొవ్వు ఉన్నట్లు నిర్ధారణ కాలేదని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఈ నివేదికను వక్రీకరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు పత్రాలను ప్రదర్శించడం బాధ్యతారాహిత్యమని ఆయన మతం వ్యక్తం చేశారు.

అంతేకాకుండా, ప్రస్తుతం చర్చనీయాంశమైన శాంపిల్స్ అన్నీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సేకరించినవేనని వెల్లంపల్లి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సిట్ రిపోర్టులో పేర్కొన్న అంశాలు ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలనే సూచిస్తున్నాయని, గత ప్రభుత్వానికి దీనితో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఒక పవిత్రమైన పుణ్యక్షేత్రం విషయంలో ఇలాంటి రాజకీయాలు చేయడం తగదని, నివేదికలోని వాస్తవాలను కప్పిపుచ్చి బురదజల్లడం సరికాదని ఆయన హితవు పలికారు.

తిరుమల వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్న చంద్రబాబు నాయుడు, దేవుడు విధించే శిక్ష నుంచి తప్పించుకోలేరని వెల్లంపల్లి హెచ్చరించారు. రాజకీయాల కోసం పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని వివాదాల్లోకి లాగడం వల్ల భక్తుల నమ్మకం దెబ్బతింటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అబద్ధపు ప్రచారాలు మానుకొని, ఛార్జ్‌షీట్‌లో ఉన్న వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వివాదం రానున్న రోజుల్లో ఏపీ రాజకీయాల్లో మరింత వేడి పుట్టించే అవకాశం కనిపిస్తోంది.

# అన్నింటినీ అధిగమించి.. 'గ్రూపు'ను సాధించి



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 31,** కృష్ణవేణిది ఎస్‌ఆర్‌పురం మండలం జీఎంఆర్‌పురం గ్రామ పంచాయతీ వడ్డికండ్రిగ గ్రామం. తల్లిదండ్రులు ఎం.దొరస్వామి, ఎం.రత్నమ్మ కూలి పనులకు వెళ్లొస్తే కానీ పూట గడవని పరిస్థితి. ఆ కూలి డబ్బులతోనే వీరు ముగ్గురు పిల్లలైన పురుషోత్తం, కృష్ణవేణి, జానకిరాంను చదివించారు. కుమారులిద్దరూ డిగ్రీ వరకు చదువుకున్నారు. ఇక, కృష్ణవేణి వడ్డికండ్రిగలోని ప్రాథమిక పాఠశాలలో 5 వరకు చదివారు. ఆరో తరగతికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని ఎస్‌ఆర్‌పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో చేరారు. ఆదే సంవత్సరం ఇంటి వద్ద దుస్తులు ఉతికి ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురవడంతో ఆమె ఎడమ కాలు, ఎడమ చెయ్యి తొలగించారు.

అప్పటి వరకు హుషారుగా పరుగులు తీస్తున్న ఆమె.. ఒక్కసారిగా అంగవైకల్యం రావడంతో ఏమాత్రం కుంగిపోలేదు. అంగవైకల్యంతో ఇంకేం చదువుతుందని గ్రామస్తులు చెప్పినా ఆమె కుటుంబీకులూ వెనకడుగు వేయలేదు. ఆమెను చదివించేందుకు చొరవ చూపారు. ఇంతటి ప్రోత్సాహం, తన పట్టుదలతో ఆమె చదువు కొనసాగించారు. పదో తరగతిలో టాపర్‌గా నిలిచి ట్రిపుల్ ఐటీకి ఎంపికై.. ఇడుపులపాయలో చేరి బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 2023లో గ్రూపు వన్‌కు ప్రయత్నించి విఫలమైనా వెనుకడుగు వేయలేదు. హైదరాబాదులో శిక్షణ పొంది, రఫీ అనే ఉద్యోగి గైడెన్స్‌లో గ్రూపు వన్, టులోనూ ఎంపికయ్యారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహమే

మాది నిరుపేద కుటుంబం. మా తల్లిదండ్రులు కూలీ పనులు చేసి నన్ను చదివించారు. నేను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివాను. నా తల్లిదండ్రులతో పాటు కుటుంబీకులు, స్నేహితులు, మెంటార్ సహకారంతో గ్రూపు వన్‌లో అసిస్టెంటు ట్యాక్స్ కమిషనరుగా.. గ్రూపు టులో సివిల్ సప్లయ్స్‌లో ఎంపికయ్యాను.

- ఎం.కృష్ణవేణి

మా సంతోషానికి అవధి లేదు

కూలి పనులు స్థానికంగా లేకపోవడంతో ఊరుగాని ఊరుకెళ్లాం. కూలి పనులు చేసుకొచ్చి బిడ్డలను పోషించాం. మా కష్టం.. మా బిడ్డలు పడకూడదని, తలెత్తుకుని తిరగాలని కోరుకున్నాం. అందుకనే కష్టపడి చదివించాం. కొడుకులిద్దరూ డిగ్రీ చదివారు. దేవుడి దయతో కృష్ణవేణి పెద్ద ఉద్యోగానికి ఎంపికైందని తెలిసి సంతోషిస్తున్నాం. ఆమెకు కాలు చేయి లేకపోయినా 'సైకిల్'పై తీసుకెళ్లాం. కష్టపడి చదివి.. ఉద్యోగం సాధించడం మా సంతోషానికి అవధి లేకుండా చేసింది.

# కుప్పం తలచుకుంటే రికార్డులు బద్దలుకావా!

కుప్పం/ శాంతిపురం, జనవరి 31 'ఇప్పుడు సాధించిన గిన్నిస్ రికార్డు ఒక్కటే కాదు, భవిష్యత్తులో ఇటువంటివి మరెన్నో సాధించి రికార్డులు బద్దలు కొట్టే శక్తి కుప్పానికి ఉంది' అని నియోజకవర్గ ప్రజలపై విశ్వాసం ఉంచి సీఎం చంద్రబాబు పలికన పలుకులివి. శాంతిపురం మండలం తుమ్మిశి ఆదర్శ పాఠశాల సమీపంలో శనివారం నిర్వహించిన 'పేదల సేవలో ప్రజా వేదిక' సభలో ఆయన ప్రసంగించారు. ప్రజారోగ్యానికి సంబంధించి కుప్పంలో మొదలు పెట్టిన సంజీవిని ప్రాజెక్టుతో నియోజకవర్గాన్ని ప్రపంచానికే ఆదర్శమైన మెడికల్ హబ్‌గా రూపొందిస్తామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఈ-సైకిల్‌ను తీసుకు వచ్చానన్నారు. ఇంకా అనేక పర్యావరణ హితమైన ప్రాజెక్టులతో కుప్పం నియోజకవర్గాన్ని హెల్దీ, హ్యాపీ సొసైటీగా చేస్తానన్నారు. ఇప్పటికే సూర్యఘర్ పేరుతో సోలార్ విద్యుత్తు ప్రాజెక్టు కుప్పంలో నడుస్తున్నదని గుర్తు చేశారు. ఎక్కువ రోజులు బతకాలనుకుంటే కుప్పం వస్తే చాలని ప్రపంచం భావించేలా ఇక్కడ పర్యావరణ పరిరక్షణ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కుప్పంలో అనీమియా, బీపీ, షుగర్ తదితర వ్యాధులు అధికంగా ఉన్నాయని తేలిందన్నారు. అందుకోసమే సంజీవిని ప్రాజెక్టు తెచ్చానని, కుప్పం ప్రజల ఆరోగ్య పరిరక్షణ ప్రథమ కర్తవ్యమన్నారు.

సైకిల్‌తో జీవితాల్లో మార్పు

'ఎక్కడికైనా దూసుకుపోయే ఈ సైకిల్.. సూపర్ సైకిల్. ఇదే మీ జీవితాల్లో గణనీయమైన మార్పులు తెచ్చింది. ఈ సైకిళ్లకోసం ప్రత్యేక పవర్ స్టేషన్లు, సైకిల్ ట్రాక్‌లు, అద్దె సైకిల్ పద్ధతికి కుప్పనుంచే శ్రీకారం చుట్టి.. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తా. ఈ సైకిల్ వినియోగంతో ఆరోగ్యం, ఆనందం దక్కుతుంది. ఇప్పటికే కుప్పంలో రూ.7088 కోట్ల పెట్టుబడులతో 16 పరిశ్రమలు తీసుకొచ్చా. ఇప్పుడు రూ.780 కోట్లతో మరో 9 కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకున్నాం. దీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 70 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి' అని చంద్రబాబు వివరించారు.

భూగర్భాన్ని జలాశయం చేద్దాం

కురిసే వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భాన్ని పెద్ద జలాశయంలా మారుద్దామని ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. 'కృష్ణా జలాలతో కళకళలాడుతున్న చెరువులను చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. ఇదే చాలదు. వాన నీటిని మనం భూగర్భ జలంగా మార్చుకోవాలి. భూగర్భాన్ని అతిపెద్ద జలాశయం చేయాలి. అప్పుడే కరువు పరిస్థితులు కుప్పంనుంచే కాదు, రాష్ట్రంనుంచే పలాయనమవుతాయి' అని చంద్రబాబు పేర్కొన్నారు. పెరిగిన జల వనరులు, ఉద్యాన పంటలతో ఒకప్పటి కరువు సీమ రాయలసీమను, హార్టికల్చర్ హబ్‌గా చేసి ఆ రంగంలో నెంబర్ వన్‌గా నిలుపుదామన్నారు. చెరువులకు ఒకప్పుడు ఉన్న దార్లను మూసేశారన్నారు. గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ మళ్లీ తెస్తామని, ఎక్కడైనా ఎవరైనా ఆక్రమించి ఉంటే వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

ఆవులు పట్టిస్తానంటే నవ్వారు

ఒకప్పుడు ఆవులు పట్టిస్తా.. జీవితాలు బాగుపడుతాయంటే నవ్వారని చంద్రబాబు గుర్తుచేశారు. అప్పటి ఆవులే తర్వాత కుటుంబాలకు ఆదాయ వనరులుగా మారాయన్నారు. ప్రస్తుతం కుప్పం నియోజకవర్గంలో 5.6 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక 80 వేల లీటర్ల ఉత్పత్తి పెరిగిందని లెక్కలు చెప్పారు.

ఈయనిట్లే మాట్లాడతాడనుకుంటే కుదరదుకుప్పం నియోజకవర్గానికి, రాష్ట్రానికి ఎన్నో చేస్తానని, ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా నిలుపుతానని సీఎం చంద్రబాబు తన




ప్రసంగంలో చెప్పారు. ఆఖరున 'ఈయనిట్లే మాట్లాడుతాడులే, మేం ఇట్లే ఉంటాములే అంటే కుదరదు. నేను ఎన్ని చెప్పినా సాయంత్రం నాలుగు క్వార్టర్లు మందేస్తే నేను చెప్పిన మందు పనిచేయదు' అని చమత్కారంగా అన్నారు. ప్రజల్లోనూ చైతన్యం రావాలని, జరుగుతున్న మార్పులను అందిపుచ్చుకుని కష్టపడి ముందుకు పోవాలన్న తపన ఉండాలన్నారు. ఏఐ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీ ద్వారా జీవితాల్లో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయని చెప్పడం ఇప్పుడు ఊహాజనితంగానే అనిపించినా.. అవన్నీ సాధ్యమేనని, ప్రయోగాలు కూడా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. తనకు మరో జన్మంటూ ఉంటే కుప్పంలోనే పుట్టాలని, మళీమళ్లీ ఇక్కడినుంచే ఎమ్మెల్యేగా గెలవాలని కోరుకుంటానని చంద్రబాబు అన్నారు.

ఈ- సైకిల్ జోరు

కుప్పంలో ఈ-సైకిల్ జోరుగా దూసుకెళ్లింది. కడపల్లెలోని ఇంటి నుంచి ఇ-సైకిల్‌పై సీఎం చంద్రబాబు బయలుదేరారు. మూడు కిలోమీటర్ల దూరంలోని తుమ్మిశి మోడల్ స్కూల్ సమీపం ప్రజావేదిక వద్దకు బ్యాటరీ ఆన్ చేయకుండా తొక్కుకుంటూ వచ్చారు. ర్యాలీగా మరికొందరు ఆయన్ను అనుసరించారు.

పేదల సేవలో..

శనివారం ఉదయం శాంతిపురం మండలం కడపల్లె సమీపం శివపురం వద్ద స్వగృహంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం గుడుపల్లె మడలం బెగ్గిలపల్లెకు చేరుకున్నారు. 'పేదల సేవలో..' కార్యక్రమం కింద ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. మునెమ్మ, వెంకట్రామప్పకు వృద్ధాప్య.. చినతాయారుకు వితంతు పింఛను అందజేశారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. క్షేమసమాచారాలు తెలుసుకున్నారు. గ్రామంలో వీధుల గుండా నడిచే సమయంలో చూడడానికి వచ్చిన జనాలకు అభివాదం చేశారు.

నేటి సీఎం కార్యక్రమాలిలా

ఆదివారం ఉదయం తుమ్మిశి ఆరోగ్య ఉపకేంద్రాన్ని సీఎం చంద్రబాబు తనిఖీ చేయనున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు 'సంజీవిని' అమలు తీరును పరిశీలించనున్నారు. రోగులతో మాట్లాడనున్నారు. తాను తనిఖీలకు వస్తానని గతంలో చంద్రబాబు చెప్పారు. ఆ మేరకు ఈ తనిఖీలు చేయనున్నట్లు తెలిసింది. అనంతరం తుమ్మిశిలోని మోడల్ స్కూల్ సమీపంలో కార్యకర్తలతో సమావేశం కానున్నారు.


# సినిమా



## ఆ హీరో కోసం ఏమైనా చేస్తా.

నటుడు జగపతి బాబు గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఒకప్పుడు హీరోగా అలరించిన ఆయన.. ఇప్పుడు సహాయ నటుడిగా, విలన్ పాత్రలతో బిజీగా ఉంటున్నారు. సినీరంగంలో తన కెరీర్, వ్యక్తిగత జీవితం, తోటి సినీ ప్రముఖులతో తన సంబంధాలపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేశారు. తన కెరీర్ పతనం ప్రారంభమైన ఆరు నెలల తర్వాత భారీ అప్పులు చేసి ఇల్లు కట్టడమే తన జీవితంలో చేసిన పెద్ద తప్పు అని ఆయన భావోద్వేగంగా తెలిపారు. దాదాపు 15-20 సంవత్సరాల పాటు ఆ అప్పులకు వడ్డీలు చెల్లించానని, ఇది తన జీవితంలో పెద్ద నష్టమని పేర్కొన్నారు. తన కుటుంబం తన సమస్యలను తెలుసుకుని బాధపడకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని, ఈ కష్టకాలంలో తన కుటుంబం ఎంతో మద్దతుగా నిలిచిందని, అది తన అదృష్టమని జగపతి బాబు అన్నారు.సైరా నరసింహారెడ్డి చిత్రంలో తన పాత్ర గురించి మాట్లాడుతూ, ఇది తాను గతంలో చేసిన పాత్రల కంటే భిన్నంగా ఉంటుందని చెప్పారు. ఈ సినిమా నిర్మాణ విలువలు, ముఖ్యంగా రామ్ చరణ్ ప్రొడక్షన్ విషయంలో చూపిన శ్రద్ధను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. జార్జియాలో షూటింగ్ సమయంలో చిన్న యూనిట్ సభ్యుల నుండి పెద్దవారి వరకు అందరికీ అద్భుతమైన ఆతిథ్యం, భోజనం, వసతి, వైద్య సేవలు అందించారని, రామ్ చరణ్ సైలెంట్‌గా వచ్చి అన్ని ఏర్పాట్లు చక్కగా చేశారని అన్నారు.. చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జునలతో కలిసి నటించిన తాను వెంకటేష్‌తో మాత్రం ఇంకా చేయలేదని తెలిపారు.

నాగార్జునతో తనకున్న బంధం, ఆయనపై తనకున్న అపారమైన గౌరవం గురించి మాట్లాడుతూ, నాగార్జున తనకంటే రెండు, మూడేళ్లు పెద్దవారని, అన్నయ్యలా కాకుండా స్నేహితుడిలా ఎక్కువ అని పేర్కొన్నారు. ప్రతీ రెండు రోజులకోసారి నాగార్జునను తలుచుకుంటానని, ఆయన జీవితాన్ని జీవించే విధానం తనకెంతో నచ్చుతుందని జగపతి బాబు చెప్పారు. సంపాదించడమే కాదు, ఖర్చు పెట్టడం, ఇవ్వడం కూడా నాగార్జునకు తెలుసని, ఆయన ప్రతి విషయంలోనూ పూర్తి హస్తం పెట్టి, నిజాయితీగా కృషి చేస్తారని ప్రశంసించారు. నాగార్జున, వెంకటేష్ వంటి వారి ఆలోచనా విధానం, ఆచరణాత్మకత ఎంతో బాగుంటాయని, వారు తమ జీవితాలను అద్భుతంగా జీవిస్తున్నారని అన్నారు.





## హోటళ్లలో తిన్న తర్వాత సోంపు ఎందుకు ఇస్తారో తెలుసా..?

మన దేశంలో భోజనం ముగిశాక గుప్పెడు సోంపు నోట్లో వేసుకోవడం శతాబ్దాలుగా వస్తున్న ఆచారం. హోటళ్లకు వెళ్లినా, శుభకార్యాలకు వెళ్లినా భోజనం తర్వాత సోంపును తప్పనిసరిగా వడ్డిస్తారు. అయితే ఇది కేవలం నోటి దుర్వాసన పోగొట్టడానికే అనుకుంటే పొరపాటే.. సోంపుకు కొంచెం జీలకర్ర తోడైతే అది శరీరానికి ఒక శక్తివంతమైన సహజ ఔషధంగా మారుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. భోజనం చేసిన వెంటనే కడుపులో జీర్ణ ప్రక్రియ మొదలవుతుంది. ఆ సమయంలో సోంపు, జీలకర్ర కలిపి నమలడం వల్ల కడుపులోని ఎంజైమ్‌లు చురుగ్గా మారుతాయి. జీలకర్ర జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఆహారం త్వరగా శక్తిగా మారేలా చూస్తుంది. ఇది కడుపులోని కండరాలను రిలాక్స్ చేసి, ఆహారం సులభంగా ముందుకు సాగేలా చేస్తుంది. దీనివల్ల భోజనం తర్వాత కడుపు భారంగా అనిపించదు.గ్యాస్, అసిడిటీకి చెక్

నేటి కాలంలో చాలామందిని వేధిస్తున్న ప్రధాన సమస్య గ్యాస్, అసిడిటీ. రాత్రిపూట భోజనం తర్వాత గ్యాస్‌తో ఇబ్బంది పడేవారికి ఈ రెండింటి కలయిక అద్భుతంగా పనిచేస్తుంది. సోంపు కడుపులో గ్యాస్ ఏర్పడకుండా నిరోధిస్తే, జీలకర్ర పేరుకుపోయిన గ్యాస్‌ను బయటకు పంపడంలో సహాయపడుతుంది. గుండెల్లో మంట లేదా ఛాతీలో అసిడిటీగా అనిపించే వారికి సోంపు చల్లదనాన్ని ఇచ్చి ఉపశమనం కలిగిస్తుంది.

బరువు తగ్గడం నుండి షుగర్ కంట్రోల్ వరకు..

సోంపు, జీలకర్ర కేవలం జీర్ణక్రియకే పరిమితం కాదు వీటి వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి:బరువు తగ్గడం: జీలకర్ర శరీరంలోని మెటబాలిజంను పెంచుతుంది, ఇది క్యాలరీలను త్వరగా కరిగించడానికి తోడ్పడుతుంది.

నోటి ఆరోగ్యం: సోంపు నోటిలోని బ్యాక్టీరియాను చంపి, సహజమైన మౌత్ ఫ్రెషనర్‌గా పనిచేస్తుంది.

షుగర్ లెవల్స్: డయాబెటిస్ ఉన్నవారిలో రక్తంలోని చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలో జీలకర్ర కొంతవరకు సహాయపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

డిటాక్స్: ఇవి కాలేయం, మూత్రపిండాలను లోపలి నుండి శుభ్రపరచడానికి సహకరిస్తాయి.

ఎలా తీసుకోవాలి?

భోజనం ముగిసిన తర్వాత ఒక చిన్న చెంచా సోంపు, అర చెంచా వేయించిన జీలకర్ర కలిపి బాగా నమిలి తినాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల దీర్ఘకాలిక కడుపు సమస్యల నుండి విముక్తి పొందవచ్చు.



## షుగర్ ఉన్నవాళ్లు పెరుగు తింటే ఏమవుతుంది..?

భారతీయుల భోజనంలో పెరుగు లేనిదే ముద్ద దిగదు. జీర్ణక్రియకు, ఎముకల బలానికి, రోగనిరోధక శక్తికి పెరుగు ఒక దివ్యౌషధం. అయితే, పెరుగు తినడం గురించి మనలో చాలామందికి కొన్ని భయాలు, సందేహాలు ఉన్నాయి. రాత్రి పూట తినకూడదని కొందరు, జలుబు చేస్తుందని మరికొందరు అంటుంటారు. ఈ అపోహలపై మహారాష్ట్రకు చెందిన హోమియోపతి నిపుణుడు సాయాజీరావు గైక్వాడ్ క్లారిటీ ఇచ్చారు. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.

పెరుగు తింటే జలుబు, దగ్గు వస్తుందా?

చాలామంది పెరుగు తింటే జలుబు చేస్తుందని భయపడతారు. అయితే దీనికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని డాక్టర్ గైక్వాడ్ స్పష్టం చేశారు. పెరుగు తిన్న తర్వాత ఎవరికైనా అసౌకర్యంగా అనిపిస్తే, అది వారి శరీర తత్వాన్ని బట్టి ఉంటుందే తప్ప అందరికీ వర్తించదు.

డయాబెటిస్ ఉన్నవారు పెరుగు తినవచ్చా?

మధుమేహ వ్యాధిగ్రస్తులు పెరుగుకు దూరంగా ఉండక్కర్లేదు. తియ్యని పెరుగులో గ్లైసెమిక్ లోడ్ తక్కువగా ఉంటుంది. పెరుగు శరీరంలో ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది. భోజనంతో పాటు తక్కువ మొత్తంలో పెరుగు తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగవు.

రాత్రి పూట పెరుగు తినకూడదా?

రాత్రి పూట పెరుగు అస్సలు తినకూడదనే కఠినమైన నియమం ఏమీ లేదు. మంచి జీర్ణశక్తి ఉన్నవారు రాత్రి భోజనంలో పెరుగును నిరభ్యంతరంగా చేర్చుకోవచ్చు. అయితే మరీ భారీగా ఉండే ఆహారాలు లేదా వేయించిన వంటకాలతో కలిపి తీసుకుంటే కొందరికి అసౌకర్యం కలగవచ్చు.

ప్యాక్ చేసిన పెరుగు ఆరోగ్యకరమేనా?

మార్కెట్లో దొరికే అన్ని ప్యాక్డ్ పెరుగుల్లో ప్రోబయోటిక్స్ ఉండవు. మీరు ప్యాక్డ్ పెరుగు కొనేటప్పుడు దాని లేబుల్ మీద ప్రోబయోటిక్ అని ఉందో లేదో కచ్చితంగా తనిఖీ చేయాలి. వీలైనంత వరకు ఇంట్లో తోడు పెట్టుకున్న తాజా పెరుగు వాడటమే శ్రేయస్కరం.

## టీమిండియాకు గుడ్‌న్యూస్..

2026 టీ20 ప్రపంచ కప్ ప్రారంభానికి కొద్ది రోజులే మిగిలి ఉంది. ఈ క్రమంలో భారత స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ ఉదర సమస్యకు శస్త్రచికిత్స చేయించుకుని పునరావాసం పూర్తి చేసుకున్నాడు. ప్రస్తుతం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) నుంచి డిశ్చార్జ్ కావడంతో భారత జట్టుకు శుభవార్తగా మారింది. విజయవంతంగా మ్యాచ్ ఫిట్‌నెస్‌ను తిరిగి పొందాడు. ఫిట్‌నెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన తిలక్ ఫిబ్రవరి 3న ముంబైలో టీమిండియాలో చేరనున్నాడు.

ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 ప్రపంచ కప్‌లోకి భారత్ అడుగుపెడుతుండటం పట్ల తిలక్ పునరాగమనం శుభసూచకం. ఈ అద్భుతమైన సౌత్‌పావ్ టీ20ఐలలో కాలక్రమేణా తన బ్యాటింగ్ సామర్థ్యాన్ని నిరూపించుకున్నాడు. నంబర్ 3లో తనదైన పాత్రను పోషించేందుకు సిద్ధంగా ఉన్నాడు.

తిలక్ లేకపోవడంతో, ఇషాన్ కిషన్ 3వ స్థానంలోకి అడుగుపెట్టి న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్ లో తుఫాన్ ఇన్నింగ్స్ లతో చెలరేగిపోయాడు. ఇది జట్టు మేనేజ్‌మెంట్‌కు తలనొప్పిలా మారింది. ఇప్పుడు ఇద్దరు ఎడమచేతి వాటం ఆటగాళ్లను ప్లేయింగ్ ౹×లో ఎలా చేర్చాలో లేదా వారి దూకుడు నైపుణ్యాల దృష్ట్యా ఎవరైనా జట్టు నుంచి బయటకు ఎవరిని పంపాలో తెలియక తికమక పడుతున్నారు.

ఫిబ్రవరి 4న నవీ ముంబైలోని డివై పాటిల్ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో జరిగే టి20 ప్రపంచ కప్ వార్మప్ మ్యాచ్‌కు తిలక్ అందుబాటులో ఉండాలి. ఈ టోర్నమెంట్ 23 ఏళ్ల యువకుడికి కెరీర్‌లో ఒక మైలురాయి అవుతుంది. ఎందుకంటే తొలిసారి ఐసీసీ ఈవెంట్‌లో కనిపించనున్నాడు. అతని చివరి టీ20ఐ మ్యాచ్ డిసెంబర్ 2025లో దక్షిణాఫ్రికాపై 42 బంతుల్లో 73 పరుగులతో దూకుడుగా కనిపించాడు. తిలక పునరాగమనం టీమిండియాకు బలమైన బ్యాటింగ్ లైనప్ ఉందని చూపిస్తోంది.

2026 టీ20 ప్రపంచ కప్ కోసం భారత జట్టు..

భారత క్రికెట్ జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సంజు శాంసన్, శివమ్ దూబే, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రింకు సింగ్.




## తిరువనంతపురంలో భారత్ జైత్రయాత్ర..

తిరువనంతపురం వేదికగా జరిగిన చివరి టీ20 పోరులో టీమిండియా సింహగర్జన చేసింది. బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్ శతక్కొడితే, బౌలింగ్‌లో అర్ష్‌దీప్ సింగ్ ఐదు వికెట్లతో కివీస్ నడ్డి విరిచాడు. చివరి వికెట్‌ను ఫినిషర్ రింకూ సింగ్ తీయడం ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. దీంతో న్యూజిలాండ్‌ను 46 పరుగుల తేడాతో ఓడించిన భారత్, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4-1తో ఘనంగా కైవసం చేసుకుంది.

టీ20 వరల్డ్ కప్ 2026కు ముందు టీమిండియా అదిరిపోయే ముగింపునిచ్చింది. శనివారం జరిగిన ఆఖరి టీ20లో భారత్ అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, ఓపెనర్ ఇషాన్ కిషన్ కేవలం 42 బంతుల్లోనే చేసిన మెరుపు సెంచరీ (103) మరియు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (63), హార్దిక్ పాండ్యా (42) మెరుపులతో నిర్ణీత 20 ఓవర్లలో 271/5 పరుగుల రికార్డు స్కోరును నమోదు చేసింది.

272 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టు ఒకానొక సమయంలో టీమిండియాను భయపెట్టింది. ఫిన్ అలెన్ కేవలం 38 బంతుల్లోనే 80 పరుగులు చేసి భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. అయితే యువ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ తన స్పెల్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. కీలక సమయంలో వికెట్లు తీస్తూ కివీస్ జోరుకు బ్రేకులు వేశాడు. అర్ష్‌దీప్ తన 4 ఓవర్ల కోటాలో 51 పరుగులు ఇచ్చినప్పటికీ, 5 వికెట్లు పడగొట్టి (ఫైఫర్) కివీస్ పతనాన్ని శాసించాడు.

మధ్యలో అక్షర్ పటేల్ రెండు కీలక వికెట్లు తీయగా, వరుణ్ చక్రవర్తి ఒక వికెట్ సాధించాడు. చివరికి న్యూజిలాండ్ జట్టు 19.4 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌట్ అయింది. విచిత్రమైన విషయం ఏమిటంటే, మ్యాచ్ చివరి వికెట్‌ను పార్ట్-టైమ్ బౌలర్ రింకూ సింగ్ తీసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. దీంతో 46 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించడమే కాకుండా, సిరీస్‌ను 4-1తో గెలుచుకుంది. టీ20 చరిత్రలో భారత్‌కు ఇది మూడో అత్యధిక స్కోరు కావడం విశేషం.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com